అకాలవర్షం.. రైతన్న ఆగమాగం



మహమ్మదాబాద్ మండలం వెంకట్‌రెడ్డిపల్లిలో వర్షానికి తడిసిన వరిధాన్యం

- భారీ వర్షానికి తడిసి ముద్దయిన వరిధాన్యం
- ఈదురు గాలులకు నేలరాలిన మామిడి కాయలు
- నేలకొరిగిన వరిపైరు
- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



గండేడ్ మండలం జిన్నారంలో..

మహమ్మదాబాద్/గండేడ్: అకాల వర్షాలతో అన్నదాత ఆగమాగమవుతున్నాడు. వ్యయప్రయాసాల కోర్చి పండించిన పంట రైతుల కళ్లెదుటే నీటిపాలై తీరని వ్యథకు గురిచేస్తోంది. సోమవారం సాయంత్రం మహమ్మదాబాద్ మండల కేంద్రంతో పాటు ధర్మాపూర్, వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లి తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. వర్షపునీటిలో ధాన్యం కొట్టుకుపోకుండా రైతులు నానా తంటాలు పడ్డారు. వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్ కొనుగోలు కేంద్రాల్లో దాదాపు 3వేల బస్తాల వరకు ధాన్యం తడిసి ముద్దయ్యింది. వారం రోజులుగా వరిధాన్యం ఆరబెట్టి.. విక్రయానికి సిద్ధంగా ఉంచినా అధికారులు కొనుగోలు చేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు వడగండ్ల వర్షానికి వరి పైరు నేలకొరగడంతో పాటు గింజలు రాలిపోయాయి. అకాల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

■ మహమ్మదాబాద్, ధర్మాపూర్, కంచన్‌పల్లి, వెంకట్‌రెడ్డిపల్లి గ్రామాల్లో మామిడి తోటలు ఎక్కువగా ఉన్నాయి. తోటల్లో కాయలు తెంచడానికి పూర్తి సమయం కాకపోవడంతో చెట్లకు కాయలు నిండుగా ఉన్నాయి. ఈ క్రమంలో కురిసిన వడగండ్ల వర్షానికి మామిడి కాయలన్నీ నేలరాలాయి. తోటలను కౌలుకు తీసుకున్న వారికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని బోరుమంటున్నారు.

■ గండేడ్ మండలంలోని జిన్నారం, వెన్నాచేడ్, జక్లపల్లి తదితర గ్రామాల్లో మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఆరబెట్టుకున్న వరిధాన్యం తడిసిపోయింది. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా తూకం వేయక పోవడంతో నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొట్టుకుపోయింది..



ఎంతో శ్రమించి పండించిన వరిధాన్యం అమ్ముకునే సమయంలో అకాల వర్షానికి తడిసి పోవడమే కాకుండా వర్షపునీటిలో కొట్టుకుపోయింది. నేను 200 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ఏడురోజులు అవుతుంది. తూకం వేయకుండా ఆలస్యం చేయడంతో అకాల వర్షానికి నష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– కొడి రఘు, రైతు, వెంకట్‌రెడ్డిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి..



రెండెకరాల్లో మామిడితోట సాగు చేస్తున్నా. ఈ సంవత్సరం మంచి కాపు వచ్చింది. కాయలు పలికిన తర్వాత తెంచి అమ్ముకుందామని అనుకున్నాం. కానీ ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షంతో మామిడి కాయలన్నీ నేలరాలిపోయాయి. చెంచులమైన మేము ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో తోటలు పెట్టుకుంటే అకాల వర్షం వల్ల రూ.వేలల్లో నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– చెంచు సందీప్, మామిడి రైతు, ధర్మాపూర్

ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మక్తల్: మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సహకారంతో ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని మక్తల్ నియోజకవర్గ ముంపు గ్రామాల బాధితులు, కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సోమవారం మక్తల్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన జూరాల ప్రాజెక్టు వల్ల రెండు రాష్ట్రాలకు తాగు, సాగునీటి అవసరాలకు ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో జీఓ 1050 ద్వారా జోగుళాంబ గద్వాల జిల్లాలోని పలు గ్రామాలు, మక్తల్ నియోజకవర్గంలోని అనుగొండ, అంకెన్‌పల్లి, దాదాన్‌పల్లి గ్రామాలను పునరావాస గ్రామాలుగా ప్రకటించిందన్నారు. ఆనాటి నుంచి ఇళ్లకు పరిహారం ఇచ్చి నూతన గ్రామాలుగా ఏర్పాటు కోసం పునరావాసం ఏర్పాటు చేయడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పూర్తిగా ఈ గ్రామాలను పట్టించుకోలేదన్నారు. వాటితో పాటు జీఓ నెంబర్ 122 ద్వారా నేరడగం, భూత్పూర్ గ్రామాల ప్రజలకు పూర్తిగా పరిహారం రాక, పునరావాసం లేక నిర్లక్ష్యానికి గురైనట్లు తెలిపారు. ముంపు గ్రామాల ప్రజల సమస్యలను గుర్తించి ప్రతి అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావిస్తూ సీఎం, నీటిపారుదలశాఖ మంత్రుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృషి మరువలేనిదన్నారు. ఆయన సహకారంతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనుగొండ గ్రామానికి నూతన ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో రూ.42 కోట్ల 11 లక్షలతో మౌలిక సదుపాయాలు, పరిపాలన అనుమతులు తీసుకొచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే అంకెన్‌పల్లి, దాదాన్‌పల్లి గ్రామాల డీఎన్ నోటిఫికేషన్ వేసి వారికి కూడా సత్వర న్యాయం కోసం ఎమ్మెల్యే కృషి చేస్తున్న సంగతి మార్చిపోకూడదని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హన్మంతు, నేరడగం మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, అనుగొండ మాజీ సర్పంచ్ గడ్డం రమేష్, నాయకులు చెన్నయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మంచి ఆరోగ్యం



మహిళలతో యోగా చేయిస్తున్న ఇన్‌స్ట్రక్టర్స్

మరికల్: నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందని యోగా ఇన్‌స్ట్రక్టర్ రామాంజనేయులు, ఆయుర్వేద ఫార్మసిస్ట్ రుక్మిణి తెలిపారు. మండలంలోని కన్మనూర్ ఆయుష్ ఆయుర్వేద హెల్త్ సెంటర్‌లో సోమవారం యోగా క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో యోగాసనాలు వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళలకు రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాల గురించి వివరించారు. అలాగే వేసవిలో వడదెబ్బ తగలకుండా పాటించాల్సిన అంశాలను వివరించారు. యోగా చేయడం వల్ల మానసికోల్లాసంతో మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. ఇంట్లో ఉదయం సమయంలో యోగాసనాలు వేస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు.

క్లుప్తంగా

కర్నిలో కంటి వైద్య శిబిరం



మక్తల్: మండలంలోని కర్ని గ్రామంలో గ్రామ పంచాయతీ ప్రాంగణంలో కంటి వైద్య శిబిరాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్ట సురేష్ కుమార్ ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో రాం రెడ్డి లయన్స్ ఆస్పత్రి వారి సౌజన్యంతో వాకిటి శ్రీహరి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. దాదాపు 100 మందికిపైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, 45 మందికి కంటి పొరల సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ నిమిత్తం మహబూబ్‌నగర్ రాంరెడ్డి లయన్స్ హాస్పిటల్‌కు ప్రత్యేక వాహనంతో తరలించారు. ఈ శిబిరం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గసం నరసింహ, లక్ష్మయ్య, మల్లేష్, శ్రీను, ఆకాశ రాములు, మైబు, శ్రీహరన్న సేవా సమితి సభ్యులు ఏ రవికుమార్, నూరుద్దీన్, హుసముద్దీన్, బోయ నరసింహ, అఫ్రోజ్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాల పాత సామగ్రికి టెండర్

మరికల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు సంబంధించిన పాత సామగ్రిని మంగళవారం టెండర్ వేస్తున్నట్లు హెచ్‌ఎం నాగరత్నమ్మ, విద్య కమిటీ చైర్మన్ స్వాతిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహించే టెండర్‌లో పాఠశాలకు చెందిన పాత బెంచీలు, కుర్చీలు, తదితర సామగ్రికి టెండర్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు టెండర్‌లో పాల్గొనాలని సూచించారు.

'చలో వరంగల్'ను జయప్రదం చేయండి

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి



మాగనూర్: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాగనూర్ మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ సభకు వెళ్లేందుకు నాయకుల సొంత వాహనాలతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జిల తరఫున ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కేఎస్పీ కాల్వలకు మరమ్మతు చేయాలి

మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద యాసంగి పంటల కోతలు ముగియగానే కాల్వలు, తూములను మరమ్మతులు చేయాలని రైతులు బాల్‌రాజ్‌గౌడ్, రాములు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. తీలేర్ నుంచి మరికల్ మీదుగా ఇబ్రహీంపట్నం శివారు వరకు కేఎస్పీ పిల్ల కాల్వ కింద దాదాపు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. ఈ కాల్వ ముళ్లచెట్లతో అల్లుకుపోవడంతో చుక్క నీరు ముందుకు రావడం లేదన్నారు. ముళ్లచెట్లను తొలగించి కాల్వలను మరమ్మతులు చేసి తూములు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా వేసవిలో నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయాలని వారు అధికారులను కోరారు.

మరమ్మతుకు నోచుకోని రోడ్డు



మాగనూర్: నిత్యం పదుల సంఖ్యలో ప్రధాన రహదారి ఎన్‌హెచ్ 167 నుంచి వడ్వాట్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఆ రోడ్డు వర్షాలకు కుంగిపోవడంతో పాటుగా వ్యవసాయ పొలాలకు సాగు నీటి పంపింగ్ కోసం అడ్డగోలుగా రోడ్డు తవ్వకాలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రజలు అనేక మార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదని వాహనదారులు, ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికే గుంతల వల్ల అనేక మంది ప్రమాదానికి గురయ్యారు. అధికారులు స్పందించి త్వరతగతిన రోడ్డు మరమ్మతులు నిర్వహించి గుంతల నుంచి ఉపశమనం కల్పించాలని కోరుతున్నారు.

ఇసుక డంపును సీజ్ చేసిన తహసీల్దార్



ముడుమాల్ గ్రామంలో అక్రమ ఇసుక డంపులను సీజ్ చేసిన తహసీల్దార్ వెంకటేష్

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో కృష్ణానది నుంచి అక్రమంగా తరలించి డంపు చేసిన ఇసుకను సోమవారం తహసీల్దార్ వెంకటేష్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డిలు సీజ్ చేశారు. కొంతకాలంగా ఈ ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా జరుగుతున్న విషయం తెలుసుకున్న అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే వారిపై కటిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై తమ శాఖ నుంచి నిరంతరం నిఘా ఉంచుతామన్నారు.

గాలికుంటు టీకాలు సద్వినియోగం చేసుకోవాలి



అడవిసత్యారంలో గాలికుంటు టీకాల కార్యక్రమం ప్రారంభిస్తున్న మండల పశువైద్యాధికారి నరేందర్

మాగనూర్: పశువులు రోగాల బారిన పడకుండా ఉండేందుకు పశువుల కాపారులు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి నరేందర్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని అడవిసత్యారం, పుంజనూర్ గ్రామాలలో గాలికుంటు టీకాల కార్యక్రమం ప్రారంభించారు. గ్రామాలలో పశుపోషకులు తప్పకుండా పశువులకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, పశువుల కాపరులు, తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



పులిమామిడిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన నాయకులు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మాజీ సర్పంచ్ సూరయ్యగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు నారాయణరెడ్డి, ఏపీఎం నిర్మల, నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, లింగం, మోహన్ రెడ్డి, కొక్కు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న విద్యుత్ బల్బులు

విద్యుత్ వృథాను పట్టించుకోని అధికారులు



నేరడగంలో పగలే వెలుగుతున్న విద్యుత్ బల్బు

మాగనూర్: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి. నిరంతరాయంగా బల్బులు వెలగడంతో విద్యుత్ వృథా అవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వడ్వాట్, అమ్మపల్లి, మాగనూర్, గజ్జరం దొడ్డి, మందిపల్లి, నెరడగందొడ్డి, కొత్తపల్లి, వర్కూర్, నేరడగం, మాగనూర్ తదితర గ్రామాల్లోని పలు కాలనీల్లో 24 గంటల పాటు విద్యుత్ దీపాలు వెలుగుతున్నా సంబంధిత అధికారులు చూసి, చూడనట్లు వ్యవహరిస్తున్నారు. సాయంత్రం వేళలో వీధి దీపాలు ఆన్ చేసి ఉదయం వేళలో బంద్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ దిశగా అధికారులు, విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ తీగలు



కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఇళ్ల మధ్య అంతర్గత రహదారుల పక్కనే ఉన్న ఎస్సీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌లకు రక్షణ కంచె లేకపోవడంతో పాటు ఎర్తింగ్ విద్యుత్ తీగలకు రాసుకుంటు వెళ్లే పశువులు, చిన్నారులు విద్యుత్ ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టు రక్షణ కంచె నిర్మించాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా, లైన్‌మెన్ ద్వారా పర్యవేక్షించి ప్రమాద నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కృష్ణా: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం 2005–06 సంవత్సరం ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నిజాముద్దీన్, పూర్వ ఉపాధ్యాయులు నాగరాజ్, నాగభూషణ్, కిషోర్, నాగరాజ్, విద్యార్థులు మహేందర్, ఇంద్రకళ, సీతాల్, లక్ష్మీదేవి, మల్లారెడ్డి, శివకుమార్, కిరణ్‌కుమార్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణారావు

కొత్తపల్లి: నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండల కేంద్రంలోని గ్రామ శివారులో ఉపాధి హామీలో చేపడుతున్న ఫాంపండ్ నిర్మాణాలను సోమవారం ఎంపీడీఓ కృష్ణారావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ ఇచ్చిన కొలతల మేరకు పనులు చేసి ప్రభుత్వం ఇస్తున్న రూ.307 రోజువారి కూలి అందేలా పని చేయాలని సూచించారు. రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు కొత్తపల్లి మండలానికి చెందిన దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని ఎంపీడీఓ కృష్ణారావు తెలిపారు.

కున్సీలో బడిబాట కార్యక్రమం



కృష్ణా: మండలంలోని కున్సీ గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరాజ్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులు ఒకటో తరగతిలో చేరే వారిని గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడినట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు అనిత, అశోక్, ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్ మంజుల ఉన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

మద్దూరు: మండలంలోని నందిపాడ్, లక్కాయిపల్లిలో భూ భారతి కార్యక్రమంపై అధికారులు సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామంలో సమస్యలున్న రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ తెలిపారు. నందిపాడ్‌లో 44, లక్కాయిపల్లిలో 34 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.

రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణ

కోస్గి రూరల్: ఈ నెల 27న వరంగల్ జిల్లాలో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ నారాయణపేట జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామకృష్ణ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కొడంగల్ నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, రుద్రప్ప, సాయిలు, మహేష్‌గౌడ్, మోహన్‌గౌడ్, హన్మంతు, నిరంజన్‌రెడ్డి, మాదవరెడ్డి, ఆశప్ప, రుక్మప్ప, తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ఊట్కూరులో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఊట్కూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కృష్ణంరాజు అన్నారు. సోమవారం ఊట్కూరులో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితులు ఫోన్‌ల ద్వారా బ్యాంక్ లావాదేవీలను చేస్తున్నట్లు ఫోన్‌లు చేసి నేరాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నెంబర్‌కు ఫోన్ చేస్తే పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. యువకులు ఆన్‌లైన్ గేమ్‌లకు, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడరాదని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రమేష్, మహేష్, హనుమంతు, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథుడి మండల పూజ



పెద్దకడ్మూర్‌లో అన్నప్రసాద వితరణ చేస్తున్న దాత జనార్దనాచారి

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ నల్లచెరువుకట్టపై ఇటీవల నిర్మించి ప్రతిష్ఠించిన తిరుమలనాథుడి మండలిపూజ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రుత్వికులు, ఆధ్యాత్మిక వ్యాఖ్యాత రాఘవేంద్రజోషి ఆధ్వర్యంలో వేద పండితులు తిరుమలనాథుడికి గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, హోమం, మండలిపూజ, పూర్ణాహుతి, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.లక్ష్మన్న, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జానకిరామ్‌రెడ్డి, కిరణ్‌ప్రకాష్ రెడ్డి, ప్రహ్లాద్‌రావు, శేఖర్‌రెడ్డి, గోవిందురెడ్డి, వెంకట్ రెడ్డి, శివారెడ్డి, వడ్ల నారాయణచారి, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్ ఏఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో రోడ్డును ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మిస్తున్నారని సోమవారం కలెక్టర్ ఏఓ జయసుధకు గ్రామస్తులు లక్ష్మారెడ్డి, భీంరెడ్డిలు ఫిర్యాదు చేశారు. గ్రామంలో బీసీ కాలనీ అమీన్‌పూర్ గ్రామానికి వెళ్లే రహదారిని గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా గ్రామానికి చెందిన సుధాపరిమళాదేవి కబ్జా చేశారని తెలిపారు. రోడ్డు ఆక్రమించడం వల్ల భవిష్యత్‌లో ప్రజలు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

రహదారులే పంట కల్లాలు



మరికల్‌లో రైల్వే వంతెనపై ఆరబోసిన ధాన్యం

మరికల్: కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసుకోవడానికి స్థలాలు లేక పోవడంతో రైతులకు రోడ్లు, మైదానాలను కల్లాలుగా మాల్చుకొని ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల దగ్గరనే ధాన్యం ఆరబోసుకోవడానికి అవకాశం కల్పించామని అధికారులు, నిర్వహకులు చెబుతున్నా జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఆ పరిస్థితి కన్పించడం లేదు. దీంతో విధిలేని పరిస్థితిలో రైతులు రహదారులపై, క్రీడా ప్రాంగణాలు, మైదానాలు, ఇలా ఒకటేమిటి ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ ధాన్యం ఎండబెడుతున్నారు. అకాల వర్షాల భయంతో ఆరిన ధాన్యం తడుస్తూ, ఎండుతూ రైతుల ఇబ్బందులు అధికమవుతున్నాయి. మరో పక్క ఆరబెట్టిన చోట నుంచి కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించేందుకు రైతులు అదనపు రవాణా ఖర్చులు భరిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మిన రైతులకు రవాణా భత్యం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.